సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

స్వచ్ఛాంధ్రకు తూట్లు!

గాడితప్పిన పారిశుద్ధ్య నిర్వహణ

ఎక్కడికక్కడే చెత్తకుప్పలు దర్శనం



మల్కాపురం-సింధియా ప్రధాన రహదారిపై ఉన్న చెత్త కుప్పలు

సింధియా: స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర లక్ష్యానికి జీవీఎంసీ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. చెత్త నిర్వహణను కూడా గాలికి వదిలేస్తున్నారు. దీంతో ఏ వార్డులో చూసినా చెత్తకుప్పలు.. మురుగుపోయిన కాలువలు దర్శనమిస్తున్నాయి. చెత్త రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దడమే లక్ష్యమని జీవీఎంసీ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి.

అంతటా చెత్తమయం

పారిశ్రామిక ప్రాంతంలోని సింధియా, మల్కాపురం, శ్రీహరిపురం వంటి ప్రధాన కూడళ్లలో చెత్తాచెదారంతో పాటు కుళ్లిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చెత్త సేకరణకు సరిపడినంత పారిశుధ్య సిబ్బంది లేరని చెబుతున్నా.. పట్టించుకోకపోవడంతో ఇబ్బంది వస్తోందని కార్మికులు చెబుతున్నారు. మరో వైపు కొంతమంది అవగాహన రాహిత్యంతో రోడ్ల వెంబడి, ఖాళీ స్థలాల్లో చెత్తను కుప్పలుగా పారబోస్తున్నారు.

పాదచారులకు ఇక్కట్లు

గాజువాక జింక్ గేటు నుంచి కొత్త నక్కవానిపాలెం, శ్రీహరిపురం, మల్కాపురం, సింధియా వంటి ప్రాంతాల్లో సేకరించిన చెత్తను మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపం వద్దకు చేర్చుతున్నారు. అక్కడ నుంచి డంపింగ్ యార్డ్‌కు తరలించడం ఆలస్యం కావడంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారితో పాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు పందులు, కుక్కలు చెత్తను లాగేయడంతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది.

కఠిన శిక్షలు అవసరం

ఆధునిక జీవనశైలిలో పరిసరాల శుభ్రతను గాలికి వదిలేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల పారిశుధ్య సమస్యలు తలెత్తి వైద్యులకు కూడా అంతు పట్టని కొత్త కొత్త వైరస్‌లు మనిషిని కబళిస్తున్నాయి. చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రతపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన రోడ్లపైనే చెత్త

జీవీఎంసీ పరిధిలో రోజువారీ చెత్త సేకరణ చేపట్టకపోవడంతో ప్రధాన రోడ్లపైనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మల్కాపురం మార్కెట్, మరిడిమాంబ కల్యాణమండపం, జాలరివీధి, ప్రకాష్‌నగర్, దుర్గానగర్, త్రినాథపురం, చింతల్లోవ, క్రాంతినగర్, కాకరలోవ తదితర ప్రాంతాల్లో చెత్త కుండీలు లేకపోవడంతో రోడ్లపైనే చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణించాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

కొరవడిన చిత్తశుద్ధి

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారికి గరిష్ఠంగా రూ. 500 మాత్రమే జరిమానా విధిస్తున్నారు. 1896 పర్యావరణ రక్షణ చట్టం ప్రకారం పర్యావరణాన్ని కలుషితం చేయడం నేరం. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడాన్ని క్రిమినల్ నేరంగా పరిగణిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చట్టాలు చేసే అధికారం కూడా ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. ప్లాస్టిక్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై నిషేధం విధించినా ప్లాస్టిక్ వినియోగం మాత్రం ఆగడంలేదు. దీంతో వాడేసిన ప్లాస్టిక్ వస్తువులను రోడ్లపై వేయడంతో అవి కాలువల్లో చేరి మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది.



షిప్‌యార్డ్‌కాలనీలో రోడ్డుపైనే వ్యర్థాలు

రోగాల బారిన పడుతున్నా..



జీవీఎంసీ అన్నరులు కాలువల పరిశుభ్రతపై నిరంతరం దృష్టి సారించాలి. రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు తరలించడకపోవడం వల్ల వ్యర్థాలతో కూడిన చెత్త కాలువల్లోకి చేరి మురుగునీరు సాఫీగా వెళ్లడం లేదు. దీంతో రోడ్లపైకి మురుగునీరు పారుతోంది. దోమలు, ఈగలు అధికమై అంటురోగాల బారిన పడుతున్నాం.

– మహేశ్వరి, మల్కాపురం

చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలి



ప్రధాన రహదారుల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలి. కొంతమంది చెత్తకు నిప్పు పెట్టి వెళ్లిపోతుండడంతో నిప్పు రవ్వలు ఎగిరి స్థానికంగా ఉన్న ఫ్లెక్సీలు, షెడ్లకు అంటుకుని అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది స్పందించి చెత్తకుప్పలను వెంటనే తరలించే ఏర్పాట్లు చేయాలి.

– సంతోష్, మల్కాపురం

క్లుప్తంగా

రైల్వే ప్రయాణికులకు భద్రతపై అవగాహన



సింహాచలం రైల్వే స్టేషన్‌లో భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మమత నాయక్

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీస్ ఫోర్స్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రయాణికుల భద్రత, అసాంఘిక శక్తులను గుర్తించడం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికుల భద్రత, మహిళల భద్రత, హ్యూమన్ ట్రాఫికింగ్ చేసేవారిని గుర్తించడం వంటి అంశాలలపై ఆర్పీఎఫ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. రైల్లో ప్రయాణించేటప్పుడు ఏవిధంగా ఉండాలి.. నిషేధిత వస్తువులు ఏంటనే విషయాలు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐలు మమత నాయక్, సూరజ్ కుమార్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో నివాసాలు



ప్రమాదకరంగా హనుమాన్‌నగర్ కొండ ప్రాంతంలో నివాసాలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్‌నగర్ కొండ ప్రాంత వాసులు బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ కొండవాలు ప్రాంతంలో సుమారు 600 కుటుంబాలు నివసిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా ఇక్కడ రక్షణ గోడ కూలింది. దీంతో నివాసీయులు ప్రమాదపు అంచున జీవనం సాగిస్తున్నారు.అధికారులు స్పందించి కొండ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

మల్కాపురం: ఎయిమ్స్ అకాడమీ ..నీట్ ఫౌండేషన్ రూపొందించిన అకడమిక్ క్యాలెండర్‌ను మంగళవారం58వ వార్డు పిలకవానిపాలెంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత పరిధిలో సుమారు 15 పాఠశాలలు ఏకతాటిపైకి వచ్చి ఎయిమ్స్ అకాడమీగా ఏర్పడడం, దాని ద్వారా పిల్లలకు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ ప్రోగ్రామ్స్ తక్కువ ఖర్చుతో అందించడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో జిప్సా ప్రెసిడెంట్ శ్రీనివాస్, సెక్రటరీ షణ్ముఖ, లక్కీ అమర్ పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



ద్విచక్ర వాహనం పత్రాలను పరిశీలిస్తున్న సీఐ విద్యాసాగర్

మల్కాపురం: నాకాబందీ కార్యక్రమంలో భాగంగా మల్కాపురం సీఐ విద్యాసాగర్ మంగళవారం ట్రాఫిక్,లా అండ్ ఆర్డర్ సిబ్బందితో కలిసి విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు.మల్కాపురం,శ్రీహరిపురం,సింధియా కూడళ్లలో ప్రతి వాహనం ఆపి రికార్డులు పరిశీలించారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు గంజాయి వంటి మత్తు పదార్థాలను వాహనాల ద్వారా తరలిస్తున్నారన్నారు. ఇలాంటి తనిఖీల ద్వారా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చునన్నారు.

ఉక్కును ప్రైవేటీకరిస్తే ప్రతిఘటన తప్పదు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు డి. ఆదినారాయణ హెచ్చరించారు. కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న నిరాహారదీక్షలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేసి కర్మాగారాన్ని సాధించుకున్నామనాన్నరు. ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ కుటిల రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేముడు,అనంద్,వర్మ,రమేష్, అప్పలరాజు,దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ లావణ్యను అభినందించిన నాయకులు



లావణ్యకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మల్కాపురం: నగర మేయర్‌పై పెట్టిన అవిశ్వాసం అంశంలో ఎన్ని ప్రలోభాలు వచ్చినా లొంగకుండా గొలగాని హరి వెంకటకుమారికి అండగా నిలిచి మేమంతా వైఎస్సార్ సీపీ సైనికులం అని చాటి చెప్పిన 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్యను వార్డుకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు అభినందించారు.అవిశ్వాసం తీర్మానంలో కూటమి నాయకులు బలవంతంగా వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లను వారి వైపు తిప్పుకున్న పారిశ్రామిక ప్రాంతానికి చెందిన 40,58,60,62వ వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు,గులిగిందల లావణ్య,పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు పార్టీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆదేశాలతో గొలగాని హరి వెంకటకుమారి వైపు నిలిచారు. దీంతో కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్పొరేటర్ లావణ్యను గుల్లలపాలెంలో మంగళవారం నాయకులు గులిగిందల కృష్ణ,కోటా కృష్ణ, గొందేశి సత్యనారాయణరెడ్డి,సాల్మన్ రాజు,ధర్మ ల వేణుగోపాలరెడ్డి,ఎదుర రాజు,రాంబాబు,శ్రీరామమూర్తి,గొవింద్,భూపతి తదితరులు సత్కరించారు.

నేలబావిలో పడిన కుక్క

బయటకు తీసిన శానిటరీ సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పరిధిలోని గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ మాల్ ఆవరణలోని నేల బావిలో వీధి కుక్క పడిపోయింది. కుక్క రోదిస్తున్నట్టు శబ్దం రావడంతో సమీపాన గల చేపల మార్కెట్ వ్యాపారులు ఎక్కడో కుక్క అరుస్తుందని భావించారు. మంగళవారం సాయంత్రం సమయంలో కుక్క అరుపులు పెద్దవిగా రావడంతో ఆ సమయంలో చేపలు కొనుగోలు చేసేందుకు వచ్చిన నేవల్ ఉద్యోగి బావిలో కుక్కను గుర్తించారు.వెంటనే వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్ యాదవ్‌కు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన తన సిబ్బంది,మార్కెట్‌లోని యువకుల సాయంతో కుక్కను బయటకు తీశారు. బుధవారం నేల బావిలో నీటిని తొలగిస్తామని చెప్పారు. బావిపై ఇనప జాలి ఏర్పాటు చేస్తామన్నారు.



గుల్లలపాలెం మార్కెట్ వద్ద నేలబావిలో పడిన కుక్కను బయటకు తీస్తున్న శానిటరీ సిబ్బంది

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని జిల్లా బిల్డింగ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, పెండింగ్ క్లెయిమ్‌ల చెల్లింపు, రెన్యువల్ కోసం ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపడతామని ఆయన వెల్లడించారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ, అధికారంలోకి వచ్చి 10 నెలలైనా సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం అన్యాయమన్నారు. భవన నిర్మాణ కార్మికుల నిధులను వారి అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టి చలో విజయవాడ నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నెల 24న జీవీఎంసీ గాంధీ పార్కులో జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పోలేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచ కార్మికోద్యమ వేగుచుక్క లెనిన్



లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా సమితి సభ్యులు

అల్లిపురం: ప్రపంచ కార్మికోద్యమ వేగుచుక్క లెనిన్ అని సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొనియాడారు. లెనిన్ 155వ జయంతి సందర్భంగా మంగళవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు మాట్లాడుతూ, ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని మార్క్స్ ఇచ్చిన పిలుపును అందుకుని లెనిన్ రష్యాలో తొలి సోషలిస్టు ప్రభుత్వాన్ని నిర్మించారని అన్నారు. లెనిన్ నాయకత్వంలో జరిగిన అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయం తర్వాత ప్రపంచంలోని అనేక దేశాల్లో విముక్తి ఉద్యమాలు ఊపందుకున్నాయని ఆయన పేర్కొన్నారు. లెనిన్ చూపిన పోరాట స్ఫూర్తి భారత కమ్యూనిస్టు ఉద్యమంపై గొప్ప ప్రభావాన్ని చూపిందని, అది ఇప్పటికీ కొనసాగుతోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, కె. సత్యాంజనేయ, ఎం. మన్మథరావు, జి. రాంబాబు, సీఎన్. క్షేత్రపాల్ రెడ్డి, ఎస్. సూరిబాబు, జి. కాసుల రెడ్డి, ఎస్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



కర్రి ఢిల్లేశ్వరమ్మ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో మృతి చెందింది. గాజువాక సీఐ కోటేశ్వరరావు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో 69వ వార్డు నాతయ్యపాలెంకు చెందిన కర్రి ఢిల్లేశ్వరమ్మ (87), గోపిశెట్టి రమణమ్మలు గాజువాకలోని ఆస్పత్రికి బయలు దేరారు. నాతయ్యపాలెం నుంచి అక్కిరెడ్డిపాలెం వైపు రోడ్డు దాటి గాజువాక వెళ్లేందుకు ఆటో ఎక్కాలి. ఈ క్రమంలో గోపిశెట్టి రమణమ్మ ముందుగా రోడ్డు దాటేసింది. కానీ ఢిల్లేశ్వరమ్మ రోడ్డు మధ్యలోనే ఉండిపోవడంతో గాజువాక నుంచి ఎన్‌ఏడీ వైపు వెళ్తున్న స్కూటీ ఢిల్లేశ్వరమ్మను ఢీ కొట్టింది. దీంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. వెంటనే స్థానికులు స్పందించి ఆమెను గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వారు రిఫర్ చేశారు.అక్కడ నుంచి అగనంపూడి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహన చోదకుడిని అదుపులోకి తీసుకుని గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాద వివరాలను సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

సర్వీసు రోడ్డులో స్టాపర్ల ఏర్పాటు



హెచ్‌పీసీఎల్ గేటు ఎదురుగా కల్యాణి ఆస్పత్రి ముందు సేవా మార్గంపై ఏర్పాటు చేసిన స్టాపర్లు



కల్యాణి ఆస్పత్రి నుంచి కోస్టుగార్డుకు వెళ్లే సేవా మార్గంలో..

మల్కాపురం: వాహనాల రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన సేవామార్గాన్ని నేవీ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వాహనాలు నిలపకుండా సేవా మార్గంపై స్టాపర్లు ఏర్పాటు చేశారు. దీనిపై ప్రశ్నిస్తే ఇది మా అడ్డా అంటూ వాదిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రధాన సేవా మార్గానికి సమీపంలో ఐఎన్‌ఎస్ కల్యాణి ఆస్పత్రి ఉంది. ఇక్కడికి నిత్యం నేవల్,ఆర్మీ,మాజీ సైనిక,మాజీ నేవీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. ద్విచక్ర వాహనాలపై వచ్చే వారు కల్యాణి ఆస్పత్రి సమీపంలోని సేవా మార్గంపై ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. అయితే కల్యాణి ఆస్పత్రి ఎదురుగా సర్వీసు రోడ్డుపై వాహనాలు నిలపకుండా సెక్యూరిటీ అధికారులు స్టాపర్స్ ఏర్పాటు చేశారు.దీంతో ఈ మార్గాన వచ్చే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇది ఇలా ఉంటే 40వ వార్డు

జీవీఎంసీ రోడ్డుపై నేవల్ పెత్తనం

కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు బంధువు సోమవారం ప్రమాదంలో మృతి చెందారు.ఆ మృతదేహం కల్యాణి ఆస్పత్రి వద్ద ఉందని తెలుసుకున్న కార్పొరేటర్ మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఆస్పత్రి వద్దకు వచ్చి స్టాపర్స్ స్థలంలో ద్విచక్ర వాహనం పార్కు చేసేందుకు వాహనాన్ని నిలిపారు. ఇంతలో అక్కడ సెక్యూరిటీ సిబ్బంది వచ్చి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.జీవీఎంసీ స్థలంలో మీ పెత్తనం ఏంటి అని కార్పొరేటర్ అడిగారు. దీంతో నేవల్ పోలీస్ అక్కడకు వచ్చి ఇక్కడ వాహనాలు నిలపకుండా స్టాపర్స్ ఏర్పాటు చేశామని, ఆస్పత్రికి వచ్చిన వారి కంటే హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్ట్ పనులు చేస్తున్న వారు అధికంగా ఇక్కడ పార్కు చేయడంతో స్టాపర్స్ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని కార్పొరేటర్‌కు నచ్చజెప్పారు. దీంతో ఆయన శాంతించారు.



కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుతో వాదిస్తున్న నేవల్ అధికారులు

కేజీహెచ్‌ను సందర్శించిన అదనపు డీఎంఈ

దాబాగార్డెన్స్: అదనపు డీఎంఈ డాక్టర్ డి. వేంకటేశ్వరరావు మంగళవారం కింగ్ జార్జ్ హాస్పటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాద విభాగం (క్యాజువల్టీ)ను పరిశీలించి, రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో నర్సింగ్ సూపరింటెండెంట్‌తో నర్సింగ్ సిబ్బంది రోస్టర్లపై చర్చించారు. త్వరలో ప్రారంభించనున్న కొత్త వార్డులను కూడా ఆయన పరిశీలించారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్, కేజీహెచ్ సూపరింటెండెంట్, ఇతర ఆస్పత్రి ప్రతినిధులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లతో డాక్టర్ వేంకటేశ్వరరావు సమావేశమయ్యారు.

హజ్ కమిటీలో పార్టీనేతలకే చోటు

రాష్ట్ర హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇమ్రాన్ ఆరోపణ



గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన ఏపీ హజ్ కమిటీలో నిజమైన ఇస్లాం లకు అన్యాయం జరిగిందని రాష్ట్ర హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ మహ్మద్ ఇమ్రాన్ ఆరోపించారు. సెంట్రల్ హజ్ కమిటీ యాక్టు 35/2002, సెక్షన్ 18 సబ్ క్లాజ్ 3 ప్రకారం కమిటీలో ముగ్గురు మత ప్రబోధకులను నియమించాల్సి ఉందన్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం 13 మంది సభ్యులను నామినేట్ చేస్తూ ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేసిందని, ఇస్లాం పండితుల కోటాలో కూడా తమ పార్టీ కార్యకర్తలనే నియమించి వారిని పెద్దలుగా పేర్కొనడం విచారకరమన్నారు. ఇది ఇస్లాం ఆచారాలను అవమానించడమేనన్నారు. తొలిసారి హజ్ యాత్రకు వెళ్లేవారు హజ్ పవిత్ర కార్యాలు సక్రమంగా నిర్వహించడం కోసం, మక్కాలో తప్పిదాలు చోటుచేసుకోకుండా పరిపూర్ణంగా యాత్ర పూర్తి చేసేందుకు ఇక్కడ శిక్షణ ఇచ్చి పంపించడానికి ముఫ్తీ, ఆలిం, హాఫీజ్‌లను కమిటీలో నియమించాలనే నిబంధనలను విధించారన్నారు. ఈ నిబంధలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి.. టీడీపీ కార్యాలయంలో పని చేసే రిసెప్షనిస్టు, పార్టీ కార్యకర్తలను నియమించారన్నారు. ఇది ఇస్లాంను, హజ్‌యాత్రను అవహేళన చేయడమేనని ఇమ్రాన్ ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జీవో 38ను రద్దు చేసి సబ్ క్లాజ్ 3 ప్రకారం అర్హులైన ఇస్లాం పండితులను నియమిస్తూ కొత్త జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు.

ఆడపిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో భద్రతపై అవగాహన కల్పిస్తున్న గాజువాక పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: ఆడపిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గాజువాక పోలీసులు సూచించారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో మంగళవారం విద్యార్థినులకు భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పురుషులు అతిక్రమించి ప్రవర్తించినా, తాకినా, అవమానకరంగా ప్రవర్తించినా వెంటనే తల్లిదండ్రుకు తెలియజేయాలన్నారు. అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై పోక్సో కేసు నమోదు చేస్తామన్నారు. సమాజంలో ఆడపిల్లలు చాలా జాగ్రత్తగా మెలగాలని అసూచించారు. ప్రభుత్వం శక్తి యాప్‌ను తెచ్చిందని, ప్రతీ ఒక్కరూ దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ప్రమాదంలో ఉన్నామని గ్రహించిన వెంకటనే శక్తి యాప్‌ను ఉపయోగించాలని, వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి రక్షణ కల్పిస్తారని చెప్పారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి, గాజువాక ఏఎస్‌ఐ వినయ్, సిబ్బంది హేమసుందర్, కొండలరావు, స్పందన, స్కూల్ పీడీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.